సాక్షి ఆదిలాబాద్

శనివారం । 3 । ఆగస్టు । 2024



బడిలో పాము కలకలం

మావల మండలంలోని బట్టిసావర్గాం యూపీఎస్‌లో శుక్రవారం పాము కలకలం రేపింది. విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు.

8లో▸

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: డైట్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో శుక్రవారం 550 మంది అభ్యర్థులకు గాను 422 మంది హాజరైనట్లు డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ ప్రక్రియ ఈనెల 6వరకు కొనసాగుతుందని వివరించారు.

గరిష్టం/కనిష్టం
29.0 /25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

- కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ నగేశ్



విమానయాన శాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ నగేశ్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించి చర్యలు తీసుకోవాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును స్థానిక ఎంపీ గోడం నగేశ్ కోరారు. శుక్రవారం ఢిల్లీలో కలిసిన ఆయన మంత్రికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలు విమానాశ్రయ నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పటికే 1592 ఎకరాల భూమిని సైతం గుర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించినట్లు వెల్లడించారు. ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తే ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయని వివరించారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ వెల్లడించారు.

5న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5న ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని చాందా(టి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డిభోజారెడ్డి, టి.రాజేశ్ ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాల బాలికలకు జావెలింగ్‌త్రో, 100, 400 మీటర్ల పరుగుపందెం పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు బోనఫైడ్, వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఆ రోజు ఉదయం హాజరు కావాలని సూచించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారిని ఈనెల 7న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.

ముర్రుపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



బాలింతకు పండ్లు అందజేస్తున్న సబిత

ఆదిలాబాద్‌టౌన్: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని జిల్లా సంక్షేమ అధికారి సబిత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో రిమ్స్ మెటర్నిటీ వార్డులో శుక్రవారం ముర్రుపాలపై అవగాహన కల్పించారు. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమన్నారు. అనంతరం బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఇందులో సీడీపీవో వనజ, సూపర్‌వైజర్ ఫర్హా, అంగన్‌వాడీ కార్యకర్త రాధ, రూపావతి, నీరజ, భగత్ లక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

రిక్షా కాలనీలో..

పట్టణంలోని రిక్షా కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఇందులో ప్రత్యేకాధికారి కళావతి, కౌన్సిలర్ లక్ష్మణ్, జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి, ఆర్పీ రజిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీలో ఐదుగురు అధికారుల బదిలీ

కైలాస్‌నగర్: జిల్లా ఆర్‌అండ్‌బీ శాఖలో జరిగిన బదిలీల్లో ఐదుగురు అధికారులు బదిలీ అయ్యారు. ఇందులో నలుగురు ఇతర జిల్లాలకు బదిలీ కాగా ఒకరికి జిల్లా పరిధిలోనే స్థానచలనం కలిగింది. ఆదిలాబాద్ డీఈగా పనిచేస్తున్న సురేశ్‌రాథోడ్ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు వెళ్లగా, బోథ్ డీఈగా పనిచేస్తున్న సునీల్ కుమార్ భైంసాకు బదిలీ అయ్యారు. ఈఈ కార్యాలయంలో డీఈగా పని చేస్తున్న రాజమ్మ జగిత్యాలకు వెళ్లగా, ఉట్నూర్ డీఈగా ఉన్న అర్విండ్ కుమార్ ఇచ్చోడకు బదిలీ అయ్యారు. ఇక డివిజన్ కార్యాలయంలో ఏఈఈగా పనిచేస్తున్న ప్రియాంక పెద్దపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. అయితే జిల్లాకు ఇతర జిల్లాల నుంచి ఒక్క అధికారి కూడా రాకపోవడం గమనార్హం. ఇప్పటికే ఖాళీల పరంగా తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొంటున్న ఆర్‌అండ్‌బీ తాజా బదిలీలతో మరింత గడ్డు పరిస్థితి ఎదుర్కోనుంది.

కుప్టి..కదలిక

- రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాజెక్టుకు రూ.234 కోట్లు
- భూపరిశీలనలో అధికారులు
- ముందు ముంపు పరిహారం తేల్చాలంటున్న రైతులు



కుప్టి వద్ద భూములను పరిశీలిస్తున్న అధికారులు



కుప్టి ప్రాజెక్ట్ నిర్మించే ప్రతిపాదిత స్థలం

సాక్షి,ఆదిలాబాద్: ఎట్టకేలకు కుప్టి ప్రాజెక్టు నిర్మాణానికి అడుగు పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.234 కోట్ల పద్దు కేటాయించింది. తొమ్మిదేళ్లుగా ఇప్పుడు.. అప్పుడు అంటూ వచ్చిన ఈ ప్రాజెక్టు విషయంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. బడ్జెట్ కేటాయింపు నేపథ్యంలో సాగునీటి, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. ప్రాజెక్టు అమరిక కోసం భూమిని పరిశీలించారు. కాగా ముంపు భూములకు పరిహారం తేల్చిన తర్వాతే ఏదైనా అని నిర్వాసితులు స్పష్టం చేస్తూ అధికారుల చర్యలను అడ్డుకుంటున్నారు.

2,500 ఎకరాలు..

కుప్టి ప్రాజెక్టు నిర్మాణం కోసం నాలుగు గ్రామాల్లో 2,500 ఎకరాలు అవసరం అవుతుందని సాగునీటి పారుదల శాఖ అధికారులు అంచనా వేశారు. తాజాగా బడ్జెట్ మంజూరు తర్వాత దీనికి సంబంధించి పూర్తిస్థాయి పరిశీలన చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. 900 ఇళ్లు కూడా కోల్పోయే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో నిర్వాసితులు ముందుగా పరిహారం ఎంత ఇస్తారనేది తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ తర్వాతే దీనిపై సర్వే చేసుకోవాలని చెబుతున్నారు.

కడెం ఆయకట్టు స్థిరీకరించేందుకు..

బచావత్ అవార్డు ప్రకారం కడెం రిజర్వాయర్‌కు 68,150 ఎకరాల ఆయకట్టుకు 13.42 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చని ఉంది. అయితే ఈ ప్రాజెక్టు వానాకాలంలో మాత్రమే నీటిని స్వీకరిస్తుంది. అది కూడా 7.20 టీఎంసీలకు మాత్రమే పరిమితమైంది. ఆయకట్టుకు నీటి డిమాండ్ ప్రధానంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఉంటుంది. ప్రతి పంట కాలం ముగిసే సమయానికి నీటి కొరత ఏర్పడుతుంది. ఇది రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. 42,883 ఎకరాలకు మాత్రమే కడెం ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. మిగతా 25,267 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు ఈ ప్రాజెక్టు ఎగువన ఉన్నటువంటి పరివాహక ప్రాంతమైనటువంటి కుప్టి వద్ద ఈ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాలని తొమ్మిదేళ్ల క్రితం.. అంటే 2015లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. కడెం ఆయకట్టుకు అనుబంధంగా ఈ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఉంటుంది. 2020-21 నుంచి పలుమార్లు డీపీఆర్ మారుతూ రాగా అంచనా వ్యయం పెరుగుతూ వచ్చింది.

సామర్థ్యం పెంచే అవకాశాలు లేకపోవడంతో..

కడెం ప్రాజెక్టును 1958 సంవత్సరంలో నిర్మించారు. 7.20 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టుకు 18 గేట్లు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ, ఇచ్చోడ మండలాల మధ్యలో ఉన్న కుప్టి గ్రామం నుంచి నీటి పరివాహకం ఉంది. ఈ నీరే కడెం ప్రాజెక్టుకు చేరుతుంది. బచావత్ అవార్డు ప్రకారం 13.42 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ కడెం వద్ద అటవీ సంపదను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచే అవకాశాలు లేవు. దీంతోనే ప్రభుత్వం ఎగువ ప్రాంతంలో ఉన్నటువంటి కుప్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి బీజం వేసింది. ఇందులో భాగంగానే కుప్టి బహుళార్థసాధక ప్రాజెక్టు నిర్మించాలని తలపెట్టారు. ఆయకట్టు స్థిరీకరణ, విద్యుత్ ఉత్పత్తి, తాగునీటి సదుపాయం అందించడం వంటి ప్రయోజనాలతో దీన్ని చేపట్టాలని యోచిస్తున్నారు.

ప్రాజెక్ట్ స్వరూపం ఇలా..

నీటి నిల్వ సామర్థ్యం: 5.30 టీఎంసీలు

నీటిమట్టం: 394.00 మీటర్లు

జలమార్గం: 7 రేడియల్ గేట్లు స్పిల్‌వేతో నిర్మాణం

ముంపు గ్రామాలు..

నేరడిగొండ మండలంలోని కుమారి, గాజిలి, గాంధారి, కుప్టి

గడిచిన నాలుగేళ్లుగా డీపీఆర్ అంచనా వ్యయం వివరాలు..

సంవత్సరం	డీపీఆర్ అంచనా వ్యయం
2020-21	రూ.846.737 కోట్లు
2021-22	రూ.900 కోట్లు
2022-23	రూ.1,100 కోట్లు
2023-24	రూ.1,323 కోట్లు

ప్రధాన ప్రయోజనాలు..

- మూడు మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి
- బోథ్ నియోజకవర్గంలో భవిష్యత్తులో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల ద్వారా కొత్తనీటి పారుదల సామర్థ్యాన్ని సృష్టించేందుకు అవకాశాలు
- నీటి ప్రవాహం కొనసాగడంతో కుంటాల జలపాతం సహజ సౌందర్యం చాలా కాలం పాటు ఉంటుంది. తద్వారా ప్రభుత్వానికి పర్యాటకుల ద్వారా ఆదాయం సమకూరుతుంది.
- కడెం ఆయకట్టు నుంచి గోదావరి నదిలో పునరుత్పత్తి నీటి కారణంగా గూడెం, ధర్మపురి వద్ద గోదావరి నదికి నీరు చేరడం ద్వారా సమీపంలో ఉన్న దేవాలయాలకు ఎక్కువ మంది యాత్రికులు ఆకర్షితులయ్యే అవకాశం ఉంటుంది.

ప్రాజెక్టు వివరాలు వెల్లడించాకే పనులు చేపట్టాలి

- సర్వేను అడ్డుకున్న 'కుప్టి' ప్రభావిత గ్రామస్తులు



ఇన్‌చార్జి తహసీల్దార్ మహేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

నేరడిగొండ: మండలంలోని కుప్టి వద్ద నిర్మించతలపెట్టిన ప్రాజెక్టు వివరాలను ముందు తెలియజేశాకే పనులు చేపట్టాలని గ్రామస్తులు స్పష్టం చేశారు. గురువారం స్థల పరిశీలనకు వచ్చిన ఉన్నతాధికారులను స్థానికులు అడ్డుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం మరోసారి ఇరిగేషన్, రెవెన్యూశాఖ అధికారులు కుప్టి వద్ద జెండాలు పాతేందుకు చేరుకున్నారు. ఈ క్రమంలో కుప్టి, కుమారి, గాజిలి, గాంధారి గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్తులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములు, నివాస గృహాలకు పరిహారం తేల్చిన తర్వాతే పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఆ తర్వాతే స్థల నిర్ధారణ, అలైన్‌మెంట్ పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. అనంతరం గ్రామస్తులు ఇన్‌చార్జి తహసీల్దార్ మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

వివరాలను ముందుంచి ప్రాజెక్టు పనులు చేయాలి



ప్రభుత్వం రూపొందించిన డీపీఆర్‌ను ప్రజల ముందు ఉంచి నిర్వాసితుల భూములకు సంబంధించి న్యాయబద్ధమైన రేటు నిర్ణయించాలి. భూములు, ఇళ్లు కోల్పోతున్న నిరుపేదలకు న్యాయం చేయాలి. పునరావాసం కల్పించాలి. రీహాబిటేషన్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను విధానపరంగా ప్రజల ముందుంచి తర్వాతే చేపట్టాలి.

– గడ్డం భీంరెడ్డి, కుమారి గ్రామం

భూసేకరణ కోసం సర్వే..



కుప్టి ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా మొదట భూసేకరణ కోసం రెవెన్యూ విభాగంతో కలిసి సాగునీటి పారుదల శాఖ అధికారులం ముందుకెళ్తున్నాం. గతంలో ఇంత భూమి కావాలని అంచనా వేయడం జరిగింది. తాజాగా రెవెన్యూ పూర్తిస్థాయిలో సర్వే చేసి ఆ భూమిని నిర్ధారించడం జరుగుతుంది.

– భీంరావు, డీఈ, సాగునీటి పారుదల శాఖ, ఆదిలాబాద్

'డయల్ 100' సేవలు కీలకం

- శాంతి భద్రతల పరిరక్షణలో ప్రధాన పాత్ర
- సంఘటన స్థలాలకు వీలైనంత త్వరగా చేరుకోవాలి
- కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేపట్టాలి
- ఎస్పీ గౌస్ ఆలం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: శాంతి భద్రతల పరిరక్షణలో డయల్ 100 సేవలు ఎంతో కీలకమని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో గల సమావేశ మందిరంలో బ్లూకోర్ట్, పెట్రోకార్, డయల్ 100 సిబ్బంది, ఎస్‌హెచ్‌వో, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, డీఎస్పీలతో డయల్-100పై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న ప్రజలకు తక్షణమే సహాయ సహకారాలు అందించడమే డయల్ 100 లక్ష్యమన్నారు. ఈ మేరకు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. కాల్ వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని, బాధితులకు న్యాయం చేకూరేలా విచారణ చేపట్టాలన్నారు. సమస్య పెద్దదైతే ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువచ్చి స్టేషన్ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా పోలీసులు అతితక్కువ సమయంలో సంఘటన స్థలాలకు చేరుకుంటున్నట్లు రికార్డులున్నాయని తెలిపారు. స్టేషన్ ముఖ్య అధికారులు ప్రతిరోజు పర్యవేక్షిస్తుండాలన్నారు. రాత్రి సమయాల్లో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో గస్తీ పెంచాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్ రెడ్డి, సీహెచ్ నాగేందర్, పట్టణ సీఐలు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం, పచ్చదనం' విజయవంతం చేయాలి

- కలెక్టర్ రాజర్షిషా
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

కైలాస్‌నగర్: పారిశుధ్య నిర్వహణతో పాటు పచ్చదనం పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5నుంచి 9వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించనున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీడీవోలు, ఆర్డీవోలు, ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐదు రోజుల పాటు చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ వార్డులో పారిశుధ్యం నిర్వహించడంతో పాటు ప్రజలకు శుద్ధమైన జలం అందించాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను వంద శాతం సంరక్షించేలా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రెయినీ కలెక్టర్ అభిఘ్నాన్ మాల్వియా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు జయప్రదం చేయండి

ఈనెల 1నుంచి ప్రారంభమై 7వరకు నిర్వహించనున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో తల్లిపాల వారోత్సవాల ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'అంతరాలను తొలగించి తల్లి ప్రాముఖ్యతను చాటుదాం..' అనే థీమ్‌తో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రతీ అంగన్‌వాడీ, సబ్‌సెంటర్, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవగాహన కల్పించి విజయవంతం చేయాలని సూచించారు. పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, మెప్మా, ఆరోగ్యశాఖ సిబ్బంది సోషల్ మీడియాతో సమన్వయం చేసుకోవాలన్నారు. వంద శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ముర్రుపాలు పట్టించే విధానంపై బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందులో జిల్లా ట్రెయినీ కలెక్టర్ అభిఘ్నాన్ మాల్వియా, జిల్లా సంక్షేమ అధికారి సబిత, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో మెరుగైన సేవలు అందేలా చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడతామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో ఆర్థోపెడిక్ జనరల్ శస్త్ర చికిత్సకు సంబంధించిన పరికరాలను శుక్రవారం ప్రారంభించారు. జీఆర్ ఇన్ఫ్రా సంస్థ సీఎస్‌ఆర్ ద్వారా రూ.25 లక్షలతో ఈ పరికరాలను కొనుగోలు చేసి రిమ్స్‌కు అందజేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎస్‌ఆర్ ద్వారా వచ్చే నిధులను వైద్యం కోసం వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, హెచ్‌వోడీలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై ఫోకస్

- 'లేఅవుట్ క్రమబద్ధీకరణ' దరఖాస్తులపై ప్రభుత్వం దృష్టి
- త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు



అనుమతి లేని వెంచర్

కైలాస్‌నగర్: అనధికార లేఅవుట్లలోని ప్లాట్లతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాట్ల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)లో భాగంగా నాలుగేళ్ల క్రితం దరఖాస్తులను స్వీకరించింది. దీనిపై కొంతమంది హైకోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియకు బ్రేక్ పడింది. ప్రస్తుతం కోర్టు కేసు పరిష్కారం కావడంతో పెండింగ్ దరఖాస్తులు వేగవంతంగా పరిశీలించి పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇది వరకు దరఖాస్తుల పరిశీలన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులే చేయగా తాజాగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు బాధ్యతలు అప్పగించింది. దీంతో మున్సిపల్ యంత్రాంగం క్షేత్రస్థాయి పరిశీలనకు సమాయత్తమవుతుంది. అయితే బల్దియాలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ప్రక్రియకు ఇబ్బందికరంగా మారనుంది.

ఎన్నికల కోడ్‌తో బ్రేక్..

ఎల్‌ఆర్‌ఎస్‌లో భాగంగా 2020 ఆగస్టు 26 వరకు ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని ఆదిలాబాద్, ఖానాపూర్, అనుకుంట (కొంతభాగం), భుక్తాపూర్,రాంపూర్(కొంత భాగం), మావల, బట్టిసావర్‌గాంవ్, కచికంటి వంటి ఎనిమిది ఎల్‌ఆర్‌ఎస్ బ్లాక్‌ల నుంచి 19,430 దరఖాస్తులు అందాయి. వాటిని అప్పట్లోనే రెగ్యులరైజేషన్ చేయాల్సి ఉండగా రాష్ట్రస్థాయిలో కొంతమంది హైకోర్టును ఆశ్రయించడంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. అయితే గతేడాది ఏప్రిల్‌లో అప్పటి ప్రభుత్వం మరోసారి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ఆదేశించింది. బల్దియా అధికారులు ప్రక్రియను కొనసాగించారు. ఏడు వేల దరఖాస్తులను పరిశీలించి 17తిరస్కరించారు. మరికొన్నింటికి ఫీజు చెల్లించాలని సూచించారు. సరిపడా సిబ్బంది లేకపోవడంతో ప్రక్రియ మందకొడిగా సా గింది. ఈక్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో బ్రేక్ పడింది.

బల్దియా సన్నద్ధం

దరఖాస్తుల పరిశీలనకు ఈసారి టౌన్‌ప్లానింగ్‌తో పాటు రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులకు కూడా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. దీంతో మూడు శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయికి వెళ్లి డాక్యుమెంట్స్, లేఅవుట్ స్థలాలు, ప్లాట్లను పరిశీలించనున్నారు. దరఖాస్తులో పేర్కొన్న ప్లాట్లు బఫర్‌జోన్, చెరువులు, కుంటలు, రైల్వేలైన్, గ్రీన్ బెల్టు, ప్రభుత్వ, హైటెన్షన్ వైర్ల కింద, రైల్వే, రోడ్లు, వివాదాస్పద, కోర్టుకేసుల పరిధిలో ఉన్నాయా అనే దాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ఉన్న ప్లాట్ల వివరాలను కమిషనర్ ఆమోదం కోసం పంపిస్తారు. అలాగే ప్లాట్ల కొలతలు, డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సమయంలో మార్కెట్ ధరలు వంటి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఒక్కో దరఖాస్తుకు గంటకు పైగా సమయం పట్టే అవకాశముంటుంది. దరఖాస్తులన్నింటినీ మూడు నెలల్లోగా పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించడం, బల్దియా టౌన్‌ప్లానింగ్‌లో తగినంత సిబ్బంది లేకపోవడంతో గడువులోగా ప్రక్రియ సాధ్యమవుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలకు సైతం ఈసారి బాధ్యతలు ఇవ్వడం బల్దియా సిబ్బందిపై కొంత భారం తగ్గే అవకాశం ఉంది.

మూడు దశల్లో ప్రక్రియ

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను మూడు దశల్లో చేపట్టనున్నారు. ఎల్-1లో రెవెన్యూ, ఇరిగేషన్, ఎల్-2లో టౌన్ ప్లానింగ్, ఎల్-3లో మున్సిపల్ కమిషనర్ నిర్ణయాలు తీసుకోనున్నారు. ఎలాంటి వివాదం లేని ప్లాట్లకు మార్కెట్ విలువ ప్రకారంగా ఫీజు చెల్లించాలని సూచిస్తారు. ఏమైనా సమస్య ఉంటే ఎన్‌వోసీని కోరుతారు. డాక్యుమెంట్స్ పూర్తిస్థాయిలో లేనట్‌లెతై వాటిని అందించేందుకు అవకాశమిస్తారు. అయితే ఓపెన్ ప్లాట్లకు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ చేస్తారు. నాలుగేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నప్పటికీ తీవ్ర జాప్యం కావడంతో చాలా మంది ఇళ్లు కట్టుకున్నారు. అయితే అలాంటి వాటిని పరిగణలోకి తీసుకోరని తెలుస్తోంది.

బల్దియా ఖజానాకు కాసుల పంట

నిధుల కొరతతో సతమతమవుతున్న ఆదిలాబాద్ బల్దియాకు ఈ ఎల్‌ఆర్‌ఎస్ కలిసొచ్చేదిగా చెప్పవచ్చు. ఈ ప్రక్రియ నిర్వహణతో మున్సిపల్‌కు భారీ ఆదాయం సమకూరే అవకాశముంది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు సంబంధించిన ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న మార్కెట్ విలువలో 14శాతం వసూలు చేయనున్నందున బల్దియాకు కోట్లలో ఆదాయం సమకూరే అవకాశముంది.

ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎల్‌ఎఆర్‌ఎస్‌కు సంబంధించి దరఖాస్తుల వివరాలు..

మొత్తం బ్లాక్‌లు: 08	అందిన దరఖాస్తులు: 19,430	ప్రాసెస్‌లో ఉన్నవి: 7,448
తిరస్కరణకు గురైనవి: 17	ఫీజు చెల్లించాలని సమాచారమిచ్చినవి: 2,781	
ఫీజు చెల్లించినవి: 1,847	ఆమోదించినవి: 63	

మూడు దశల్లో ప్రక్రియ

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను మూడు దశల్లో చేపట్టనున్నారు. ఎల్-1లో రెవెన్యూ, ఇరిగేషన్, ఎల్-2లో టౌన్ ప్లానింగ్, ఎల్-3లో మున్సిపల్ కమిషనర్ నిర్ణయాలు తీసుకోనున్నారు. ఎలాంటి వివాదం లేని ప్లాట్లకు మార్కెట్ విలువ ప్రకారంగా ఫీజు చెల్లించాలని సూచిస్తారు. ఏమైనా సమస్య ఉంటే ఎన్‌వోసీని కోరుతారు. డాక్యుమెంట్స్ పూర్తిస్థాయిలో లేనట్‌లెతై వాటిని అందించేందుకు అవకాశమిస్తారు. అయితే ఓపెన్ ప్లాట్లకు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ చేస్తారు. నాలుగేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నప్పటికీ తీవ్ర జాప్యం కావడంతో చాలా మంది ఇళ్లు కట్టుకున్నారు. అయితే అలాంటి వాటిని పరిగణలోకి తీసుకోరని తెలుస్తోంది.

ప్రభుత్వ ఆదేశాలు అందాయి..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఈ సారి మాతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో అధికారులు కొత్తగా బాధ్యతలు చేపట్టినందున రెండు, మూడు రోజుల్లో పూర్తి స్థాయి మార్గదర్శకాలు అందే అవకాశముంది. వాటి ప్రకారం ప్రక్రియను ప్రారంభించి త్వరగా పూర్తిచేసేలా దృష్టి సారిస్తాం.

– సుమలత, టౌన్ ప్లానింగ్ అధికారి

క్లుప్తంగా

గల్ఫ్ సమస్యలపై సీఎంకు వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

ఖానాపూర్: గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కరించడంతోపాటు గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సంఘాల ప్రతినిధులు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గల్ఫ్ మృతులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు ఎన్ఆర్ఐ పాలసీ ప్రవేశపెట్టాలని, రూ.500 కోట్ల నిధులు విడుదల చేయాలని తదితర సమస్యలను విన్నవించారు. సీఎం సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్, కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ వినోద్, గల్ఫ్ ప్రతినిధులు దొనికేని కృష్ణ, మంద భీంరెడ్డి తదితరులు ఉన్నారు.

కిరాణా సామగ్రి దగ్ధం



పూర్తిగా కాలిపోయిన సామగ్రి

గుడిహత్నూర్: మండలంలోని గురుజ గ్రామంలో గురువారం రాత్రి కిరాణా షాపులో దేవుని చిత్రపటాల వద్ద వెలిగి ఉన్న దీపం కిందపడి కార్టూన్ డబ్బాలకు తగిలి మంటలు చెలరేగింది. అగ్నికి కిరాణా సామగ్రి దగ్ధమైంది. ఫర్నిచర్‌తో సహా సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని బాధితురాలు నేతుల మమత తెలిపింది. ప్రభుత్వం బాధితురాలిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అదుపు తప్పితే..అంతే



ప్రమాదకరంగా వంతెన పైనుంచి వెళ్తున్న వాహనదారులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని పొచ్చేర శివారులో గల వంతెన ప్రమాదకరంగా మారింది. ఇక్కడ గుంతలు పూడ్చడానికి వేసిన మట్టి కురుస్తున్న వర్షాలతో బురదమయంగా తయారైంది. దీంతో వంతెనపై ఓవైపు పెద్ద గుంత, మరోవైపు మట్టి కుప్ప ఉండడంతో ఈ దారిగుండా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు, రైతులు, ప్రజలు, ఉద్యోగులు జిల్లాకేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన వద్ద ఎలాంటి హెచ్చరికలు లేకపోగా, ప్రమాదకరంగా గుంతలు ఏర్పడ్డాయి. అదుపు తప్పితే అంతే..అన్నట్టుగా పరిస్థితి ఏర్పడింది. ప్రమాదాలు సంభవించకముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మైదానం ఇలా..ఆడేదెలా?



లాంగ్ జంప్ కోసం ఏర్పాటు చేసిన ఫీల్డ్ నీటితో నిండిన దృశ్యం



బురదమయమైన ట్రాక్



గడ్డి మొక్కలు ఏపుగా పెరిగిన హాకీ ఫీల్డ్

- బురదమయమైన ట్రాక్
- పిచ్చిమొక్కలతో హాకీ ఫీల్డ్
- సాధనకు క్రీడాకారులు, విద్యార్థుల అవస్థలు
- ఇందిరా ప్రియదర్శిని స్టేడియం దుస్థితి

ఆదిలాబాద్: అది జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానం.. తెలంగాణలోనే ప్రతిష్ఠాత్మకమైన క్రీడా పాఠశాల ఉన్నా ప్రాంతం. అయితే అక్కడ అన్ని అరకొర వసతులే దర్శనమిస్తాయి. ఎంతోమంది క్రీడాకారులను జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నేడు సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతోంది. గతంలో అధికారులు క్రీడాకారుల సౌకర్యార్థం భవన సముదాయాలు నిర్మించడంతోపాటు క్రీడా పాఠశాల ఏర్పాటయ్యేలా శ్రమించారు. ప్రస్తుతం నిర్వహణ లోపంతో విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులు, వాకర్స్‌కు ఇబ్బందులు తప్పడం లేదు.

సమస్యలెన్నో..

స్టేడియంలోకి అడుగుపెట్టగానే క్రీడాకారులు, వ్యాయామ సాధకులకు గుంతలే దర్శనమిస్తున్నాయి. 800 మీటర్ల రన్నింగ్ ట్రాక్ తేలికపాటి వర్షానికి చిత్తడిగా మారుతుంది. క్రీడా పాఠశాల విద్యార్థులు, నడక సాధకులు, ఉద్యోగార్థులకు అవస్థలు తప్పడం లేదు. బురదమయమైన ట్రాక్ పైనే సాధన చేయాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. ఏళ్లుగా ఈ సమస్యకు పరిష్కారం కావడం లేదు. లాంగ్ జంప్, హైజంప్ సాధన చేయడానికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు లేవని నిరుద్యోగ అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. గతంలో ప్రతిరోజూ క్రీడాకారులు ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేసేవారు. అయితే మైదానంలోని గోల్‌పోస్ట్‌లు తొలగించడంతో వారి సాధన కాస్త ఆగిపోయింది. ప్రస్తుతం హాకీ ఫీల్డ్ పిచ్చి మొక్కలు పెరిగి దర్శనం ఇస్తుండడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ గురించి పట్టించుకునేవారే కరువయ్యారు. ఇక, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారి కంపుకొడుతోంది. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ కూలర్ నాచుతో దర్శనమిస్తోంది.

గడ్డిలో నుంచి పరిగెత్తాలి



చిన్నపాటి వర్షం కురిసినా ట్రాక్ బురదమయం అవుతోంది. సాధన చేయడానికి ఇబ్బందిగా ఉంది. ట్రాక్ పక్కన గడ్డిలో నుంచి పరుగెత్తాల్సి వస్తుంది. ఉద్యోగ నోటిఫికేషన్ల సమయంలో ఇబ్బందులు అధికమవుతాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– భీంరావు, డిగ్రీ, ఎస్టీ హాస్టల్

సింథటిక్ ట్రాక్ నిర్మించాలి



చిత్తడిగా మారిన మైదానంలో వ్యాయామం చేయడానికి స్థలం లేకుండా పోయింది. భవన సముదాయ మెట్లపై సాధన చేద్దామంటే పశువుల పేడతో కంపుకొడుతోంది. సింథటిక్ ట్రాక్ నిర్మిస్తే ఎంతో సౌలభ్యంగా ఉంటుంది.

– జంగు, వ్యాయామ సాధకుడు

రోడ్డు బాగు చేయకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం



తెగిన కల్వర్టును పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ ఆత్రం మీరాబాయి, గ్రామస్తులు

నార్నూర్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు అధ్వానంగా మారిన రోడ్లను వారంలో బాగు చేయకుంటే మూడు గ్రామాల గిరిజనులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌ని ముట్టడిస్తామని మాజీ ఎంపీపీ ఆత్రం మీరాబాయి హెచ్చరించారు. మండలంలోని బాబేఝరి చిత్తగూడ వద్ద భారీ వర్షానికి కోతకు గురైన కల్వర్టును గ్రామస్తులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. నడ్డంగూడ వద్ద రోడ్డు నిర్మించాలని పీఏసీఎస్ డైరెక్టర్ పూసం రాము, జైభారత్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దీపక్‌లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబేఝరి, చిత్తగూడ, సుంగాపూర్, గొండుగూడ, కొలాంగూడ, తండా, చోర్‌గాం గ్రామాల ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందవుతుందన్నారు. అత్యవసర సమయంలో గ్రామాలకు 108, 102 అంబులెన్స్‌లు రాలేని పరిస్థితి ఉందని తెలిపారు.

సీఎంతో ముఖాముఖికి తరలిన ఉపాధ్యాయులు



సీఎంతో ముఖాముఖి కార్యక్రమానికి బయల్దేరిన బస్సులకు జెండా ఊపుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ముఖ్యమంత్రితో ముఖాముఖి కార్యక్రమానికి జిల్లా నుంచి ఉపాధ్యాయులు బస్సుల్లో శుక్రవారం బయల్దేరి వెళ్లారు. ఉదయం పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ జెండా ఊపి ప్రారంభించారు. ఇటీవల పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిర్మల్ పట్టణం నుంచి ఏడు బస్సులు, భైంసా, ముధోల్ నుంచి మూడు బస్సులు, ఖానాపూర్ నుంచి ఒక బస్సులో 465 మంది ఉపాధ్యాయులు తరలివెళ్లారని వివరించారు. బస్సులవారీగా ప్రయాణ వివరాలను నిర్దేశించిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రయాణ సమయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో గోవింద్, అసిస్టెంట్ డిపో మేనేజర్ రాజశేఖర్, ఫిజికల్ డైరెక్టర్లు, ఎంపీడీవోలు, లైజనింగ్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బురదలో దిగబడిన వాహనం



భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్‌లో సిలిండర్ లోడ్‌తో వెళ్తున్న వాహనం మిషన్ భగీరథ పైప్‌లైన్ గుంతలో దిగబడింది. శుక్రవారం కాలనీలోని గ్యాస్‌ఏజెన్సీ గోదాం వద్దకు వెళ్తుండగా ఒక్కసారిగా గుంతలో దిగబడింది. ఇటీవలి వర్షాలకు బురదగా మారడంతో వాహనం టైర్లు అందులో కూరుకుపోయాయి. జేసీబీ సహాయంతో వాహనాన్ని బయటకు తీశారు. భగీరథ పనులతో రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో రోడ్డు బాగు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బడిలో పాము కలకలం

- పరుగులు తీసిన విద్యార్థులు
- ఆదిలాబాద్ జిల్లా బట్టిసావర్గాం యూపీఎస్‌లో ఘటన



పామును పట్టుకున్న యువకుడు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని బట్టిసావర్గాం యూపీఎస్‌లో శుక్రవారం పాము కలకలం రేపింది. విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. ఒక్కసారిగా కేకలు వేయడంతో ఏం జరిగిందోనని ఉపాధ్యాయులు, స్థానికులు ఆందోళన చెందారు. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు గదిలో పామును చూసి కేకలు వేస్తూ పరుగు పెట్టారు. విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు గ్రామస్తులకు తెలియజేయడంతో ఓ యువకుడు ఆ పామును పట్టుకున్నాడు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా పాఠశాల ఆవరణలో పల్లె ప్రకృతి వనం నర్సరీ ఉండడంతోనే పాములు వస్తున్నాయని, రెండో తరగతి గదిలో పామును చూసి చిన్నారులు కేకలు పెట్టారని హెచ్‌ఎం రవికుమార్ తెలిపారు. పాములతో పాటు ఇతర విషకీటకాలు ఆవరణలో సంచరిస్తున్నట్లు పేర్కొన్నారు. పల్లెప్రకృతి వనం నర్సరీని మరో ప్రాంతానికి తరలించాలని కోరారు.

చెత్త పేరుకుపోవడంపై కౌన్సిలర్ నిరసన



నిరసన తెలుపుతున్న కౌన్సిలర్ రాజేష్

కైలాస్‌నగర్: రోజుల తరబడి కాలనీలో చెత్త పేరుకుపోవడంపై ఆదిలాబాద్‌లోని 25వ వార్డు బీజేపీ కౌన్సిలర్ రాజేష్ శుక్రవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కాలనీవాసులతో కలిసి చెత్తను రోడ్డుపై పడేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గ్రహించిన బల్దియా అధికారులు పారిశుధ్య సిబ్బందిని అక్కడికి పంపించి పరిసరాలను శుభ్రం చేయించారు. కౌన్సిలర్ మాట్లాడుతూ అధికారులకు వాస్తవ పరిస్థితులను తెలియజేయాలనే ఉద్దేశంతోనే నిరసన తెలిపినట్లు వివరించారు.





అద్భుత కళాఖండాలు




నిర్మల్ సమీపంలోని గండి రామన్న ఆలయ క్షేత్రం పరిసరాల్లో పెయింటింగ్ కళాఖండాలను అద్భుతంగా తీర్చిదిద్దారు. కొండ ప్రాంతంలోని బండరాళ్లు ఆనుకొని గీసిన పెయింటింగ్‌లు, పలు చిత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఇదే ప్రాంగణంలో సాయిబాబా, దత్తాత్రేయ ఆలయాలు, సమీపంలో నందిగుండం దుర్గామాత మందిరం ఉండడంతో భక్తుల రద్దీ ఉంటోంది. ఈ ప్రాంతం పెయింటింగ్ చిత్రాలతో నూతనశోభను సంతరించుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్







అద్దెకు ఆర్టీసీ బస్సులు

ఆదిలాబాద్: వివాహాలు, విహారయాత్రలు, శుభకార్యాలకు సంబంధించి అద్దె ప్రతిపాదికన ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు ఆదిలాబాద్ ఆర్ఎం సోలోమన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని డిపోల పరిధిలో బస్సులను ముందస్తు బుక్ చేసుకుని సేవలు పొందవచ్చని తెలిపారు. వివరాలకు ఆదిలాబాద్, ఉట్నూర్ డిపోలకు సంబంధించి 99592 26002, నిర్మల్ 99592 26003, మంచిర్యాల 99592 26004, భైంసా 99592 26005, ఆసిఫాబాద్ 99592 26006 సెల్ నంబర్లలో డిపో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నీటి లభ్యత, నాణ్యత వివరాల సేకరణ



వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

బోథ్: మండలంలోని సొనాల, పార్డి(కె) గ్రామాల్లో శుక్రవారం నీటి లభ్యత, నాణ్యత వివరాలను కేంద్రబృందం సభ్యులు సేకరించారు. ఇంటింటికీ తిరుగుతూ, అంగన్‌వాడీలు, పాఠశాలలు, పీహెచ్‌సీలకు వెళ్లి స్వచ్ఛమైన నీరు వస్తుందో లేదో వివరాలు తెలుసుకున్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈఈ కళ్యాణ్ చక్రవర్తి, బృందం సభ్యులు ఉన్నారు.

ఆటో బోల్తాపడి సౌత్‌క్యాంపస్ విద్యార్థి మృతి



ప్రీతమ్ (ఫైల్)

కామారెడ్డిక్రైం: ఆటో బోల్తాపడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా సాంగ్వి గ్రామానికి చెందిన బేడద్కర్ ప్రీతమ్(27) భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌లో ఉంటూ పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వ్యక్తిగత పనులపై శుక్రవారం సాయంత్రం కామారెడ్డికి వచ్చాడు. అతడు ప్రయాణిస్తున్న ఆటో ప్రియా థియేటర్ రోడ్ క్రాసింగ్ వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. తలకు బలమైన గాయం కావడంతో ప్రీతమ్‌ను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికే మృతిచెందాడు. ప్రీతమ్ తండ్రి రాంకిషన్ నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. ప్రీతమ్ మృతితో సౌత్‌క్యాంపస్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆకట్టుకుంటున్న ‘ఘన్‌పూర్’



బోథ్: మండలంలోని ఘన్‌పూర్ జలపాతం చూపరులను ఆకట్టుకుంటుంది. జలపాతం అందాలను వీక్షించేందుకు శుక్రవారం సందర్శకులు తరలివచ్చారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారి తల్లికి సుకన్య సమృద్ధి ఖాతా బాండు అందిస్తున్న అధికారులు

నిర్మల్‌రూరల్: తపాలా సేవలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ దేవిరెడ్డి సిద్ధార్థరెడ్డి కోరారు. మండలంలోని చిట్యాల గ్రామంలోని తపాలాశాఖలో డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించారు. 282 మంది పొదుపు ఖాతాలు, పాలసీలను కొత్తగా ఓపెన్ చేశారు. భైంసా సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, నిర్మల్ ఐపీపీ బ్రాంచ్ మేనేజర్ కళ్యాణ్, తపాలా అధికారులు నరేశ్, పవన్, సాయిచరణ్, ప్రవీణ్, సాయన్న, కలిముద్దీన్, నరసింహారెడ్డి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

సారంగాపూర్: మండలంలోని బీరవెల్లిలో ఒన్నె సుధాకర్ ఇంట్లో శుక్రవారం దొంగలు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు..సుధాకర్ తన గొర్రెల మంద తీసుకుని మేత కోసం గ్రామ సమీపంలోని అటవీప్రాంతానికి వెళ్లాడు. భార్య లక్ష్మి పొలానికి వెళ్లింది. తాళం వేసిన ఇంటిని దొంగలు గుర్తించారు. తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 7 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న సుధాకర్ తాళం పగిలి ఉండడాన్ని గమనించి భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై శ్రీకాంత్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులకు చెక్కు అందజేత

బాసర: గోదావరి నది నీటిపారుదల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం అభివృద్ధి కోసం మండల కేంద్రంలోని శ్రీవేదభారతి పీఠం వ్యవస్థాపకుడు శ్రీ వేద విద్యానంద గిరి స్వామి రూ.50 వేలు ప్రకటించారు. శుక్రవారం రైతులకు ఈ చెక్కు అందజేశారు. ప్రతిఏటా రూ.లక్ష వరకు ఆర్థికసాయం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో రైతులందరూ పంటలు పండించాలన్నారు.